

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి వెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.

వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు
ఎడిటర్
☎ 9440814576

సంపుటి : 04 సంచిక : 185 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు గురువారం, నవంబరు 05, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram

అగ్నివీరులకు మోదీ సర్కార్..
బంపరాఫర్..!!

నాలుగేళ్లు కాదు.. ఇక ఆరేళ్లు సర్వీసు!

- 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్లు సాయుధ దళాల్లో పనిచేసే అవకాశం
- వారి మొత్తం సర్వీసు కాలం నాలుగేళ్ల నుంచి ఆరేళ్లకు పెరగనుంది
- గత నాలుగేళ్లలో అగ్నివీరుల పనితీరుపై నిర్వహించిన మూల్యాంకనాల్లో సానుకూల ఫలితాలు
- వారి సేవలను మరింత కాలం వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది
- ఆరేళ్ల తర్వాత రెగ్యులర్ ఉద్యోగానికి అవకాశం!
- నిర్దేశించిన అర్హతలు, పనితీరు, నిష్పాక్షిక ఎంపిక ప్రమాణాల ఆధారంగానే తుది ఎంపిక
- అదనపు రెండేళ్ల సర్వీసు సమయంలో అగ్నివీరులకు మెరుగైన పారితోషికం

న్యూఢిల్లీ: అగ్నివీరులకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం భారీ



ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. అగ్నిపథ్ పథకంలో కీలక మార్పులు చేస్తూ, తొలి నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత రెగ్యులర్ సర్వీసులోకి ఎంపిక కాని మిగిలిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్లు సాయుధ దళాల్లో పనిచేసే అవకాశం కల్పించింది. దీంతో వారి మొత్తం సర్వీసు కాలం నాలుగేళ్ల నుంచి ఆరేళ్లకు పెరగనుంది. నవంబర్ 4న ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం అనంతరం చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (జనా) జనరల్ ఎన్.ఎన్. రాజా సుబ్రమణి ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.

75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్ల అవకాశం... ఇప్పటివరకు అమల్లో ఉన్న అగ్నిపథ్ విధానం ప్రకారం, నాలుగేళ్ల సర్వీసు పూర్తయ్యాక ప్రతిభ, అర్హత, సైనిక దళాల అవసరాలను బట్టి గరిష్ఠంగా 25 శాతం మందిని మాత్రమే రెగ్యులర్ సర్వీసులోకి తీసుకునేవారు. మిగిలిన 75 శాతం మంది విధుల నుంచి విడుదల కావాల్సి వచ్చేది. అయితే తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఈ 75 శాతం మందికి మరో రెండేళ్ల పాటు సేవ చేసే



రష్యాలో ఉద్యోగాల పేరుతో...
యువతకు వల..!!

ఏపీ ప్రభుత్వం కీలక హెచ్చరిక

అమరావతి : రష్యాలో ఉద్యోగాల పేరుతో యువతకు వల వేస్తున్నారని.. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు ఏపీ సర్కార్

2




'మురసు' ప్రభావిత ప్రాంతాల్లో
సీఎం చంద్రబాబు
ఏరియల్ సర్వే

ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి తుపాను ప్రభావం, సహాయక చర్యలపై సమీక్ష

అమరావతి : మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు (బుధవారం) ఏరియల్ వ్యూ నిర్వహించారు. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. చిలకలూరిపేట, ఒంగోలు, కొత్తపట్నం, చినగంజాం, చీరాల, బాపట్ల ప్రాంతాల్లో మురసు తుఫాన్ నష్టాన్ని ముఖ్యమంత్రి పరిశీలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో హెలికాప్టర్ ల్యాండ్ కావడానికి అనుకూల వాతావరణం లేకపోవడంతో సీఎం ఏరియల్ వ్యూ ద్వారా పంటలను పరిశీలిస్తున్నారు. ఏరియల్ వ్యూ అనంతరం అమరావతి సచివాలయానికి చేరుకుని ఆర్టీజీఎస్ నుంచి మురసు తుఫాన్ ప్రభావంపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

సీఎం చంద్రబాబుకు...
ప్రధాని మోదీ ఫోన్..!!

- రాష్ట్రంలో అర్నబ్, మురసు తుపాన్లతో కలిగిన నష్టంపై ఆరా
- భారీ వర్షాలు, ఈదురుగాలులతో రైతులకు భారీగా నష్టం వాటిల్లింది
- రోడ్లు, విద్యుత్ సరఫరా సహా వివిధ రంగాలకు పెద్ద ఎత్తున నష్టం
- రాష్ట్రానికి తగిన సాయం అందించాలని ప్రధానికి విజ్ఞప్తి
- తుపాను సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం బాగా పనిచేసింది
- అప్రమత్తతతో ఇబ్బందులను సమర్థంగా అధిగమించారు..



అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబుకు ప్రధాని నరేంద్రమోదీ ఫోన్ చేశారు. రాష్ట్రంలో అర్నబ్, మురసు తుపాన్లతో కలిగిన నష్టంపై ఆయన ఆరా తీశారు. వారం వ్యవధిలో రెండు తుపాన్ల తాకిడి, ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తుపాన్లతో కలిగిన నష్టాన్ని ప్రధానికి సీఎం వివరించారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో రైతులకు భారీగా నష్టం వాటిల్లిందన్నారు. రోడ్లు, విద్యుత్ సరఫరా సహా వివిధ రంగాలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని చెప్పారు. రాష్ట్రానికి తగిన సాయం అందించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. తుపాను సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం బాగా పనిచేసిందని మోదీ అన్నారు. అప్రమత్తతతో ఇబ్బందులను సమర్థంగా అధిగమించారని సీఎంను ప్రధాని ప్రశంసించారు.



ఎన్నికల కమిషనర్లకు...
జీవితకాల చట్టపరమైన
రక్షణ..!!

సుప్రీంకోర్టులో పిటిషన్

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. 2023 నాటి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలోని సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ పిటిషనర్ అరుణ్ కుమార్ అగర్వాల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్'లోని సెక్షన్ 16 ఇప్పుడు వివాదానికి కారణమైంది. ఈ నిబంధన ప్రకారం.. సీఈసీ లేదా ఎన్నికల కమిషనర్ అధికారిక విధుల నిర్వహణలో చేసిన లేదా మాట్లాడిన విషయాలపై ఎలాంటి

తెలంగాణ ప్రగతిలో యాదవుల...
భాగస్వామ్యం అవసరం..!!

- సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించింది
- ఇది యాదవులకే కాదని.. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి ఆత్మగౌరవ సమ్మేళనం
- యాదవ సోదరులందరికీ సదర్ సమ్మేళన శుభాకాంక్షలు...
- యాదవ సోదరుల ఆత్మగౌరవానికి ఎక్కడా లోటు లేకుండా చూసే బాధ్యత తమది
- భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం..
- మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం...
- తెలంగాణలో తాము కులగణన చేసి చూపించాం...
- రాష్ట్ర మోడల్‌ను దేశం అనుసరించేలా కులగణన నిర్వహించాం..
- తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించాం..
- యాదగిరి గుట్ట గోశాలలో గోసంరక్షణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం..
- రాబోయే యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటాం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

యాదవులు కొరగానే తమ ప్రభుత్వం సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది యాదవులకే కాదని.. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి ఆత్మగౌరవ సమ్మేళనమని పేర్కొన్నారు.

2లో



మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని.. ఇందుకు యాదవ సోదరుల సహకారం ఉండాలని కోరారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి గోల్కొండ కోట ఒకనాటి గొల్లంకొండ అని ప్రస్తావించారు. యాదవ సోదరుల సహకారంతోనే హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందిందని అన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారిని యాదవ సోదరులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని చెప్పుకొచ్చారు. గతంలో ఏ ముఖ్యమంత్రి సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని పేర్కొన్నారు.

తెలంగాణలో కులగణన చేశాం.. సదర్ సమ్మేళనం నిర్వహణకు తమ ప్రభుత్వంలో రూ.5 కోట్లు మంజూరు చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణలో

హైదరాబాద్ : యాదవులు కొరగానే తమ ప్రభుత్వం సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది యాదవులకే కాదని.. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి ఆత్మగౌరవ సమ్మేళనమని పేర్కొన్నారు. యాదవ సోదరులందరికీ సదర్ సమ్మేళన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో ఈరోజు (బుధవారం) హైదరాబాద్ NTR స్టేడియంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. యాదవ సోదరుల ఆత్మగౌరవానికి ఎక్కడా లోటు లేకుండా చూసే బాధ్యత తమదని మాటిచ్చారు. **భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం..** దేశంలో తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టాలనేదే తమ ప్రయత్నమని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు.

తీరం దాటినా మురసు ప్రభావం
తగ్గలేదు..!!

ఈ ప్రాంతాల్లో ఈదురుగాలులతో వర్షాలు

మురసు తుఫాను తీరం దాటి బలహీనపడినప్పటికీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కొనసాగుతున్నాయి. ఒంగోలు సమీపంలో తీరం దాటిన తుఫాను వలన కోస్తాంధ్ర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

మురసు తీవ్ర తుఫాను నవంబర్ 3న తెల్లవారుజామున ఒంగోలు సమీపంలో తీరం దాటినప్పటికీ, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలపై ఇంకా స్పష్టంగా కనిపిస్తోంది. తుఫాను బలహీనపడి, అల్పపీడనంగా మారే క్రమంలో పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. వాతావరణ శాఖ అధికారుల అంచనా ప్రకారం, మురసు తుఫాను ప్రస్తుతం కోస్తాంధ్ర, తూర్పు తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర దిశగా ప్రయాణిస్తూ రాబోయే గంటల్లో మరింత బలహీనపడనుంది. తీరం దాటే సమయంలో గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలులు, విపరీతమైన భారీ వర్షాలతో మురసు తీవ్ర విధ్వంసం సృష్టించింది. తీరం దాటిన కొన్ని గంటల తర్వాత గాలుల తీవ్రత తగ్గి సాధారణ తుఫానుగా, ఆపై



అల్పపీడనంగా మారుతుండటంతో పరిస్థితి కొంత ప్రశాంతంగా మారే అవకాశం ఉంది. అయినప్పటికీ, ఈ ప్రక్రియలో ఒక్కసారిగా చాలా ప్రాంతాలను అతలాకుతలం చేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో తుఫాను ప్రభావం : మురసు తుఫాను ప్రభావంతో నవంబర్ 3న ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి

..2వ పేజీలో

ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ..!!

(మొదటిపేజీ తరువాయి) సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసులను కూడా కొనసాగించకూడదు. పదవిలో ఉన్నప్పుడే కాకుండా పదవీ విరమణ తర్వాత కూడా ఈ రక్షణ వర్తిస్తుంది. ఈ నిబంధన ఎన్నికల కమిషనర్లకు అవసరానికి మించిన రక్షణ కల్పిస్తోందని పిటిషనర్లు వాదిస్తున్నారు. అధికారిక విధుల పేరుతో తప్పులు చేసినా, దురుద్దేశంతో వ్యవహరించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని పేర్కొంటున్నారు. ఇది రాజ్యాంగంలోని 14, 21వ అధికరణాలతో పాటు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై



విచారణ జరిపింది. అర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, న్యాయవాది అరుణ్ కుమార్ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది. ఓటరు జాబితా నుంచి తప్పుగా పేరు తొలగించినా, అభ్యర్థికి అన్యాయం జరిగినా, ఎన్నికల సంఘంలో అవినీతి జరిగినా బాధితులకు న్యాయపరమైన పరిష్కారం లేకుండా పోతుందని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత 2023 బిల్లులో ఎన్నికల కమిషనర్లకు ఇలాంటి సంపూర్ణ రక్షణ కల్పించే నిబంధన లేదని, అనంతరం బిల్లుకు సవరణ ద్వారా సెక్షన్ 16ను చేర్చారని, ఇందుకు తగిన కారణాలను ప్రభుత్వం వెల్లడించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఎంపీలు పెద్ద సంఖ్యలో సస్పెన్షన్‌లో ఉన్న సమయంలో ఈ రక్షణ నిబంధనతో కూడిన బిల్లును పార్లమెంట్ ఆమోదించిందని పిటిషనర్ పేర్కొన్నారు.

తెలంగాణ ప్రగతిలో యాదవుల
భాగస్వామ్యం అవసరం..!!

(మొదటిపేజీ తరువాయి) తాము కులగణన చేసి చూపించామని ఉద్ఘాటించారు. రాష్ట్ర మోడల్‌ను దేశం అనుసరించేలా కులగణన నిర్వహించామని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని వెల్లడించారు. అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని తెలిపారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించామని ప్రస్తావించారు. యాదగిరి గుట్ట గోశాలలో గోసంరక్షణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

తీరం దాటినా మురసు ప్రభావం
తగ్గలేదు..!!

(మొదటిపేజీ తరువాయి) భారీ వర్షాలు కురిశాయి. దక్షిణ కోస్తా, మధ్య కోస్తా జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. బాపట్ల, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా జిల్లా, విజయవాడ, పల్నాడు, వెస్ట్ గోదావరి ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కుండపోత



వర్షాలు పడ్డాయి. గంటకు 50 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. నేడు కూడా కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఐఎండీ ఇచ్చిన మ్యాప్ ప్రకారం, బుధవారం కోస్తాంధ్రలో భారీ వర్షాలకు అవకాశం లేకపోయినా, ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది, అంటే వర్షం ఉండే అవకాశం ఉంది. ఈదురు గాలులు, మేఘావృతమైన ఆకాశం ఉండవచ్చు.

తెలంగాణలో మురసు ప్రభావం: మురసు తుఫాను ప్రభావం తెలంగాణలోనూ స్పష్టంగా కనిపించింది. మంగళవారం తెలంగాణలోని చాలా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడ్డాయి. ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. బుధవారం దమ్మపేట, అశ్వారావుపేట, ములకాలపల్లె, కొత్తగూడెం, భద్రాచలంలో విపరీతమైన వర్షాలు పడుతున్నాయి. భద్రాచలం, ఖమ్మం, మహబూబాబాద్‌లలో కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తోంది. తెలంగాణ అధికారుల అంచనా ప్రకారం, నేడు, రేపు కూడా ఇలాంటి పరిస్థితే ఉండే అవకాశం ఉంది. గురువారం నాటికి భారీ వర్షాలు తగ్గి సాధారణ వర్షాలుగా మారి, ఆపై పరిస్థితి ప్రశాంతంగా మారవచ్చు.

ప్రభుత్వ హెచ్చరికలు, జాగ్రత్తలు : తీరం దాటినప్పటికీ, మురసు తుఫాను ప్రభావం నుంచి పూర్తిగా బయటపడలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. భారీ వర్షాల వలన చెట్లు పడిపోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటం వంటివి జరిగాయి. మత్స్యకారులను వేటకు వెళ్లొద్దని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, పైకప్పులు ఎగిరిపోయే ప్రమాదం ఉన్నందున పూరిళ్లు, పెంకుటిళ్లలో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని హెచ్చరించారు. ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. అత్యవసర పరిస్థితి అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కూడా టెక్నాలజీ ద్వారా ముందే హెచ్చరికలు జారీ చేసి, అవసరమైనవన్నీ నిల్వ చేసుకోవాలని సూచించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అధికారులు జారీ చేసే సూచనలను పాటించాలని కోరారు.

రష్యాలో ఉద్యోగాల పేరుతో
యువతకు వల..!!

(మొదటిపేజీ తరువాయి) ఈరోజు (బుధవారం) ఓ ప్రకటన విడుదల చేసింది. ఆకర్షణీయమైన ప్రకటనలు, అధిక వేతనాల ఆశచూపి రష్యా సైన్యంలోకి బలవంతంగా తరలిస్తున్నట్లు పేర్కొంది. అక్రమ ఏజెంట్లు, అనధికారిక శిక్షణా సంస్థల చేతిలో ఉత్తరాంధ్ర యువత మోసపోతున్నారని వెల్లడించింది. విదేశాలకు తీసుకెళ్లి.. తప్పుడు కేసుల్లో ఇరికిస్తామని బెదిరించి సైనిక కార్యకలాపాల్లోకి దళారులు నెట్టేస్తున్నారని ఏపీ ప్రభుత్వం తెలిపింది. గుర్తింపు లేని ఏజెంట్లను నమ్మి విదేశాలకు వెళ్లవద్దని సూచించింది. వీసా, ఉద్యోగ ఒప్పందాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపింది. నియామక సంస్థల చట్టబద్ధతపై పూర్తి విచారణ, అధికారిక ధ్రువీకరణ జరిగిన తర్వాతే ముందడుగు వేయాలని సూచించింది. అనుమానాస్పద ఉద్యోగ ఆఫర్లు, ఏజెంట్ల వివరాలను తక్షణం పోలీసులకు, ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొంది. విదేశీ ఉద్యోగాల విషయంలో తొందరపాటు వద్దని.. దళారుల మాయమాటలు నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఏపీ సర్కార్ సూచించింది.

నిరసన పేరుతో ఏ స్థలాన్నీ.. ఎల్లకాలం
ఆక్రమించుకోవడం తగదు
సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: రాంలీలా మైదాన్ వంటి వేదికల్ని నిరసనల పేరుతో ఎల్లకాలం ఆక్రమించుకోవడం తగదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ప్రతి నిరసన కార్యక్రమానికి నిర్దిష్ట కాలమంటూ ఉండాలంది. దేశ రాజధానిలో నిరసనలకు సంబంధించిన పలు పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పండుగల కాలంలో తమ వ్యాపారాలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా రాంలీలా మైదాన్ వద్ద నిరసనలు చేపట్టకుండా విపక్ష ఇండియా కూటమిని నిలువరించాలని వర్తక సంఘాలు దాఖలు చేసిన పిటిషన్ దీనిలో ఒకటి. ఇండియా కూటమి పక్షాలను ఇందులో ప్రతివాదులుగా చేర్చాలని వర్తక సంఘాలకు ధర్మాసనం తెలిపింది. సీఈసీ వ్యతిరేక ప్రదర్శనలు చేస్తున్న వర్గాలనూ పిటిషన్లో చేర్చాలని, లేదంటే దీనిలో న్యాయనిర్ణయం చేయలేమని పేర్కొంది. కేంద్రం, ఇతర వర్గాల స్పందనను తెలుసుకోగోరింది. సీజేఐ స్పందిస్తూ.. "మీరు శాశ్వతంగా ఒక దీక్షా ప్రదేశాన్ని ఆక్రమించుకోవడం తగదు. ఇతర నిరసనకారులూ ఉంటారు కదా! రైతులు, పాత్రికేయులు, న్యాయవాదులు, ఇళ్లులేనివారు ఎక్కడికి పోవాలి? కార్మిక సంఘాలు ఏమైపోవాలి? నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుంది. నిరసన హక్కుకు, జీవనోపాధి హక్కుకు మధ్య సంతులనం సాధించాలి. ఇవి రెండూ రాజ్యాంగబద్ధ హక్కులే. మేం వ్యాపార సంస్థల గురించి కాకుండా రోజువారీ అమ్మకాలపై ఆధారపడే చిరు వ్యాపారుల కోసం మాట్లాడుతున్నాం. అలాంటివారు ఎక్కడికి పోవాలి?" అని ప్రశ్నించారు. మరోవైపు సుప్రీంకోర్టు వరకు నిర్వహించిన ర్యాలీలో లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ తనను ఉద్దేశపూర్వకంగా నెట్టివేశారని ఓ పాత్రికేయురాలు దాఖలుచేసిన పిటిషన్‌పై రాహుల్, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సమాధానాలు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది.



అగ్నివీరులకు మోదీ సర్కార్ బంపరాఫర్..!!

(మొదటిపేజీ తరువాయి) అవకాశం లభించనుంది. సీడీఎస్ రాజా సుబ్రమణి మాట్లాడుతూ.. గత నాలుగేళ్లలో అగ్నివీరుల పనితీరుపై నిర్వహించిన మూల్యాంకనాల్లో సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి సేవలను మరింత కాలం వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వివరించారు.

ఆరేళ్ల తర్వాత రెగ్యులర్ ఉద్యోగానికి అవకాశం!.. ఈ నిర్ణయంలో మరో కీలక అంశం ఉంది. రెండేళ్ల అదనపు సర్వీసు పూర్తయిన తర్వాత కూడా సాయుధ దళాల్లో కొనసాగాలని కోరుకునే అగ్నివీరులకు రెగ్యులర్ సర్వీసులో చేరే అవకాశం కల్పించనున్నారు. అయితే ఇది ఆటోమేటిక్‌గా జరిగే నియామకం కాదు. నిర్దేశించిన అర్హతలు, పనితీరు, నిష్పాక్షిక ఎంపిక ప్రమాణాల ఆధారంగానే తుది ఎంపిక ఉంటుంది. అదనపు రెండేళ్ల సర్వీసు సమయంలో అగ్నివీరులకు మెరుగైన పారితోషికం కూడా అందించనున్నారు.

రాజ్‌నాథ్ సింగ్ ఏమన్నారంటే?... ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఈ మార్పులకు ఆమోదం తెలిపిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా భారత సాయుధ దళాలను మరింత యువతరం, ఆరోగ్యవంతం, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన బలగాలుగా



తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అగ్నివీరులకు కూడా తమ సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు అదనపు అవకాశం లభిస్తుందని తెలిపారు.

తొలి బ్యాచ్ సర్వీసు పూర్తి చేసుకునే సమయం ఇదే!... 2022 జూన్ 14న కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద సైన్యం, నావికాదళం, వైమానిక దళాల్లో నాలుగేళ్ల కాలానికి అగ్నివీరులను నియమిస్తున్నారు. తొలి బ్యాచ్ అగ్నివీరులు 2026 నవంబర్, డిసెంబర్ నెలల్లో తమ నాలుగేళ్ల సర్వీసును పూర్తి చేసుకోనున్నారు. నేవీ తొలి బ్యాచ్ నవంబర్ 21న, వైమానిక దళం డిసెంబర్ 21న, ఆర్మీ డిసెంబర్ 31న సర్వీసు పూర్తి చేసుకోనుంది.

అగ్నిపథ్ పథకంలో ఇకపై ఏం మారనుంది?... తాజా నిర్ణయంతో నాలుగేళ్ల తర్వాత ఉద్యోగం కోల్పోతామనే ఆందోళనలో ఉన్న అగ్నివీరులకు మరో రెండేళ్లు దేశానికి సేవ చేసే అవకాశం లభించనుంది. ఇప్పటికే ఉన్న 25 శాతం రెగ్యులర్ నియామక విధానం కొనసాగుతూనే, మిగిలిన 75 శాతం మందికి అదనపు సర్వీసు అవకాశం కల్పించనున్నారు. అంతేకాకుండా, అగ్నివీరుల నైపుణ్యాలను గుర్తించే స్కిల్ సర్టిఫికెట్లను కూడా అందించనున్నారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో రాత పరీక్షను ఫిజికల్ టెస్టుకు ముందుగా నిర్వహించే మార్పును కూడా ప్రకటించారు. మొత్తంగా కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం అగ్నివీరుల సర్వీసు విధానంలో కీలక మార్పుగా నిలవనుంది. అయితే అదనపు సర్వీసుకు సంబంధించిన పూర్తి అర్హతలు, అమలు విధానం, ఎంపిక వివరాలపై మరిన్ని అధికారిక మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది.

సంపాదకీయం

రూ. 15 కోట్ల క్రిప్టో స్కాం మోసాన్ని
ఛేదించిన ఏపీ సీఐడీ

అమరావతి : భారీ అంతర్జాతీయ వ్యవస్థీకృత క్రిప్టోకరెన్సీ మోసాన్ని రాష్ట్ర సీఐడీ పోలీసులు ఛేదించారని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. క్రిప్టో పెట్టుబడులపై అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించి, అమాయకులతో కోట్ల రూపాయలలో పెట్టుబడులు పెట్టించారని తెలిపారు. మోసపూరిత పద్ధతుల్లో నిధులను అంతర్జాతీయ క్రిప్టో ప్లాట్‌ఫాంలకు మళ్లించి మోసం చేసే ముఠాలు పెరిగాయని తెలిపారు. ఈరోజు (బుధవారం) అమరావతి వేదికగా డీజీపీ మీడియాతో మాట్లాడారు. ఈ అకౌంట్‌లను స్తంభింపచేసి, నిధులను వారి ఖాతాల నుంచి భాధితురాలి ఖాతాకు తరలించేలా కోర్టు ఆదేశాలు జారీ చేసిందని డీజీపీ చెప్పుకొచ్చారు. ఏపీ సీఐడీ తొలిసారిగా సుమారు ఖాణ 1.5 మిలియన్లు (దాదాపు రూ.15 కోట్లు) విలువైన భారీ అంతర్జాతీయ వ్యవస్థీకృత క్రిప్టోకరెన్సీ పెట్టుబడి మోసాన్ని విజయవంతంగా ఛేదించిందని అన్నారు. 2025లో తెనాలికి చెందిన బాధితురాలిని నకిలీ క్రిప్టోకరెన్సీ పెట్టుబడి ప్లాట్‌ఫాంలో పెట్టుబడులు పెట్టేలా ప్రలోభ పెట్టారని తెలిపారు. బాధితుల నుంచి కాజేసిన నిధులను పలు అంతర్జాతీయ క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజి ఖాతాలకు మళ్లించినట్లు ఏపీ సీఐడీ గుర్తించిందని చెప్పారు. అధికారుల సమగ్ర దర్యాప్తుతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహకారంతో ఖాతాలు, క్రిప్టో ఆస్తులను గుర్తించి, అంతర్జాతీయ మోసపూరిత నెట్‌వర్క్‌కు కీలకమైన ఆర్థిక సంబంధాలను ఏపీ సీఐడీ వెలికితీసిందని డీజీపీ తెలిపారు. ఈ కేసులోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేయడంతో పాటు, సంబంధిత న్యాయస్థానంలో చార్జీషీట్ దాఖలు చేసిందని చెప్పారు. అంతర్జాతీయ క్రిప్టోకరెన్సీ ప్లాట్‌ఫాంల ద్వారా మళ్లించిన బాధితురాలి రూ. 15 కోట్లను గుర్తించామని అన్నారు. బాధితురాలి నుంచి రూ. 15 కోట్ల క్రిప్టో ఆస్తులను ఆమె ఖాతాకు జమ చేసేందుకు చర్యలు చేపట్టడంలో సీఐడీ ఆంధ్రప్రదేశ్ అధికారులు సమన్వయంతో పని చేశారని తెలిపారు. ఏపీ సీఐడీ టీంలో కీలకంగా పని చేసిన వారికి నజరానాలు ప్రకటిస్తున్నామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.



లిథియం, నికెల్ ప్రాసెసింగ్‌కు...
రూ.2,814 కోట్ల ప్రోత్సాహక పథకం
: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కేంద్ర కేబినెట్ లిథియం, నికెల్ ఖనిజాల ప్రాసెసింగ్ కోసం రూ.2,814 కోట్ల మూలధన వ్యయ ప్రోత్సాహక పథకానికి ఆమోదం తెలిపిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ పథకం ద్వారా దేశంలో భారీ స్థాయిలో లిథియం, నికెల్ శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

దేశంలో సమగ్ర, స్వయం సమృద్ధి కలిగిన కీలక ఖనిజాల వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. లిథియం, నికెల్ ఖనిజాల ప్రాసెసింగ్ కోసం రూ.2,814 కోట్ల మూలధన వ్యయ ప్రోత్సాహక పథకానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కీలకంగా మారనున్న పరిశ్రమలకు అవసరమైన ఖనిజాల విషయంలో దేశీయ సామర్థ్యాలను పెంచుకోవడమే ఈ పథకం లక్ష్యమని వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే భవిష్యత్తు పరిశ్రమలకు అవసరమైన రంగాల్లో దేశీయ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి తన ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లు, సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధనం, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, ఆధునిక తయారీ రంగాలకు కీలక ఖనిజాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ ప్రాధాన్యతను గుర్తించిన ప్రధాని మోదీ, దేశంలోని కీలక ఖనిజాల విలువ ఆధారిత సరఫరా వ్యవస్థ అభివృద్ధిని జాతీయ ప్రాధాన్యతల్లో ఒకటిగా తీసుకున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. గత రెండేళ్లలో ఈ రంగంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 901 ఖనిజ అన్వేషణ ప్రాజెక్టులను చేపట్టడంతో పాటు 56 కీలక ఖనిజ బ్లాకులను వేలం వేసినట్లు పేర్కొన్నారు. కీలక ఖనిజాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు రూ.1,500 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించామని, ఇందులో 58 కంపెనీలకు ఆమోదం లభించిందని వివరించారు. ఈ కంపెనీల ద్వారా ఏడాదికి 8.5 లక్షల టన్నుల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. గనుల వ్యర్థాలు, టైలింగ్స్ నుంచి విలువైన ఖనిజాలను వెలికితీసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, పరిశోధనలను బలోపేతం చేసేందుకు తొమ్మిది సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తాజాగా కేంద్ర కేబినెట్ ఆమోదించిన రూ.2,814 కోట్ల పథకం ద్వారా కీలక ఖనిజాల విలువ ఆధారిత సరఫరా వ్యవస్థలో మరో ముఖ్యమైన దశ అయిన దేశీయ ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం లభిస్తుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద దేశంలోనే తొలిసారిగా భారీ వాణిజ్య స్థాయిలో లిథియం, నికెల్ శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం సుమారు రూ.9,560 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఏడాదికి 60 వేల టన్నుల లిథియం, లక్ష టన్నుల నికెల్ శుద్ధి చేసే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. 2030 నాటికి దేశానికి అవసరమయ్యే ఈ ఖనిజాల అంచనా డిమాండ్‌కు ఈ సామర్థ్యం దగ్గరగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు రూ.25 వేల కోట్ల విలువైన ఉత్పత్తి సాధ్యమవుతుందని మంత్రి అంచనా వేశారు. కొత్త పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు, పారిశ్రామిక సామర్థ్యాలు దేశంలో పెరుగుతాయని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న కొద్దీ స్వచ్ఛ ఇంధనం, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఆధునిక తయారీ రంగాల్లో లిథియం, నికెల్ అవసరం గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. దేశంలోనే ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం వల్ల దిగుమతులపై ఆధారపడటం తగ్గడంతో పాటు అంతర్జాతీయ రాజకీయ పరిణామాల వల్ల సరఫరాలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఈ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో నాలుగు ప్రత్యేక క్రిటికల్ మినరల్ ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పార్కులు, తాజా ప్రోత్సాహక పథకం కలిపి దేశంలో ప్రాసెసింగ్ కేంద్రాలు, వాటికి అనుబంధంగా పనిచేసే పరిశ్రమల ఏర్పాటుకు బలమైన పునాది వేస్తాయని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏఏజ) బ్యాటరీలు, క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్స్ తయారీకి సంబంధించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (ఏఆ×) పథకాలకు ఊతం లభిస్తుందని మంత్రి తెలిపారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్, రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ పథకం వంటి కీలక జాతీయ కార్యక్రమాలకు కూడా ఈ నిర్ణయం తోడ్పడుతుందని చెప్పారు. స్వచ్ఛ ఇంధనం, బ్యాటరీ నిల్వకు సంబంధించిన దేశ లక్ష్యాల సాధనలోనూ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ పథకం దేశ పారిశ్రామిక వ్యవస్థపై విస్తృత ప్రభావం చూపుతుందని కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అనుబంధ పరిశ్రమల్లో పెట్టుబడులు పెరగడం, కొత్త ఉద్యోగ అవకాశాలు కలగడం, నైపుణ్యాభివృద్ధికి అవకాశాలు విస్తరించడం, దేశీయ తయారీ రంగం బలోపేతం కావడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని తన ప్రకటనలో వివరించారు.



ఎన్నికల బందోబస్తుపై డీఎస్పీ మాణిక్యరావు

క్షేత్రస్థాయి తనిఖీలు

పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు..

పుట్టపర్తి , నవంబరు 04, అమరావతి వెలుగు : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీస్ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పుట్టపర్తి డీఎస్పీ సి. మాణిక్యరావు పోలీస్ అధికారులకు



సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎన్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం పుట్టపర్తి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ తదితర మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు విధులు, సిబ్బంది మోహరింపును సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన భద్రత కల్పించాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో అనవసరంగా గుమిగూడే వ్యక్తులను నియంత్రించాలని, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఎస్పీ మాణిక్యరావు ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ వెంట కొత్తచెరువు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే. రాజశేఖర్‌తో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ త్వరితగతిన

పూర్తి చేయాలి

అనంతపురం, నవంబరు4, అమరావతి వెలుగు : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా



ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ పి. జగదీష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం (నవంబరు 5) జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన ఎన్నికల సామగ్రి పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీని ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. బుధవారం సాయంత్రంలోగా పంపిణీ ప్రక్రియను ముగించేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైన రవాణా, భోజనం, వసతి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో షామియానాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. జోనల్, రూట్ అధికారులు సమన్వయంతో ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన సామగ్రిని సిబ్బందికి అందజేస్తున్నారని వివరించారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి సమస్యలు లేకుండా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ సామగ్రి అన్ని కేంద్రాలకు సురక్షితంగా చేరేలా పోలీసు భద్రత కల్పించామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో రూరల్ ఎంపీడీవో, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కొత్తచెరువు, నవంబరు 4, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా కొత్తచెరువు మండలంలో



ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ



ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు



అధికారులకు అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా, షామియానాలు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అగ్నిమాపక యంత్రాలు, విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

రాప్తాడు ఘటనలో బాలిక ఆరోగ్యం మెరుగుపడింది

అనంతపురం , నవంబరు 04, అమరావతి వెలుగు : రాప్తాడు ఘటనలో గాయపడి అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిని



రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఏవీఎస్. సూర్యనారాయణరాజు, కమిషన్ సభ్యుడు చల్లా మధుసూదనరావు బుధవారం పరిశీలించారు. బాలికను, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదకర పరిస్థితి నుంచి బాలిక ఆరోగ్యం మెరుగుపడిందని, అవసరమైన వైద్య చికిత్సతో పాటు ప్లాస్టిక్ సర్జరీ కూడా చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కమిషన్ చైర్‌పర్సన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31న రాప్తాడులో జరిగిన ఘటనపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ వెంటనే స్పందించి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, నిందితుడికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని కోరినట్లు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే బాలికను అనంతపురం జీజీహెచ్‌కు తరలించి వైద్యులు సమర్థవంతంగా ప్రాథమిక చికిత్స అందించారని, అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. బాధితురాలి వైద్య ఖర్చులకు ఎంతైనా వెచ్చించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమన్నారు. బెంగళూరులో చికిత్స పొందుతున్న బాలికను కూడా స్వయంగా పరామర్శించామని, అక్కడి వైద్యులు ఆమె ఆరోగ్య పరిస్థితి ప్రమాదకర స్థాయి నుంచి మెరుగుపడినట్లు తెలిపారని చెప్పారు. అవసరమైన తదుపరి చికిత్సలు, ప్లాస్టిక్ సర్జరీ నిర్వహించేందుకు వైద్యులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో బాలిక ఆరోగ్య పరిస్థితిని కూడా వైద్యులను అడిగి తెలుసుకున్నామన్నారు. నిందితుడిపై నమోదు చేసిన కేసులు,



వర్తింపజేసిన చట్టపరమైన సెక్షన్ల వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నామని తెలిపారు.



బాధితురాలి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఆమె నుంచి మరిన్ని వివరాలు సేకరించి అవసరమైతే అదనపు సెక్షన్లు చేర్చనున్నట్లు పోలీసులు కమిషన్‌కు వివరించారన్నారు. నిందితుడికి చట్టప్రకారం శిక్ష పడేలా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు.

బాలల భద్రతకు పటిష్ఠ చర్యలు... పిల్లలకు రక్షణ, జీవించే హక్కు, విద్యా హక్కులు అత్యంత ముఖ్యమైనవని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. బాధిత బాలికలు పూర్తిగా కోలుకుని సాధారణ జీవితం గడిపేలా అవసరమైన వైద్య సహాయం, ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. బాధిత పిల్లల భవిష్యత్తును దృష్టిలో



ఉంచుకుని ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రాప్తాడు ఘటన జరిగిన పాఠశాలను, పరిసర ప్రాంతాలను కమిషన్ సభ్యులు పరిశీలించారని తెలిపారు. ప్రహరీ గోడ, సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఇలాంటి ఘటన జరగడం ఆందోళనకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయాలని, బయటి వ్యక్తులు అనుమతి లేకుండా తరగతి గదుల్లోకి ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆంధ్రప్రదేశ్‌ను బాలల స్నేహపూర్వక రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు. బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందించేందుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కమిషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. తక్షణమే వైద్య సేవలు అందించిన అనంతపురం జీజీహెచ్, బెంగళూరు మణిపాల్ ఆస్పత్రి వైద్య బృందాలను అభినందించారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగాన్ని కోరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్‌రావు, శ్రీ సత్యసాయి జిల్లా బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్ నాగసుధ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ కరుణ, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ సుధారాణి, ఆర్థోపెడిషియన్ డాక్టర్ గౌస్, డీసీపీఓ మంజునాథ్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ప్రతినిధి కృష్ణమాచారి, డీసీపీయూ యూనిట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఇది అనంతపురం ప్రజల విజయం..

నగర అభివృద్ధికి కృషి చేస్తాం

అనంతపురం, నవంబరు 4, అమరావతి వెలుగు : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడంపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయాన్ని నగర ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మేయర్ రమేష్‌గౌడ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ అభ్యర్థికి విజయాన్ని అందించిన నగర ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల నేతలు, మేధావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో అధికార పార్టీ నుంచి ఎదురైన ఒత్తిళ్లు, ప్రలోభాలను అధిగమించి పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో పనిచేశాయని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు కాపలాదారులుగా ఉంటామని, నగరంలో అవినీతి, భూకబ్జాలు, దౌర్జన్యాలకు తావులేకుండా ప్రజల పక్షాన నిలుస్తామని చెప్పారు. మేయర్, కార్పొరేటర్లు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తారని తెలిపారు. అనంతపురం ఆత్మగౌరవానికి, ఢిల్లీ అహంకారానికి మధ్య జరిగిన పోరులో ప్రజలు ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని



అనంత వెంకటరామిరెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ధన్యవాదాలు తెలిపారు. నగరంలో గెలుపొందిన అన్ని పార్టీల కార్పొరేటర్లు రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. జిల్లాలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మేయర్ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని, భయాందోళనల కారణంగా పోలింగ్ శాతం తగ్గిందని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచిన, ఓడిన అభ్యర్థులందరూ కలిసికట్టుగా నగర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతపురం ప్రజల తీర్పును గౌరవించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగర అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్‌లో అవినీతికి తావులేకుండా, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతామని రమేష్‌గౌడ్ స్పష్టం చేశారు.

ఎన్నికల ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించరాదు

: జేసీ మౌర్య భరద్వాజ్

ఓబులదేవర చెరువు, నవంబరు 04, అమరావతి వెలుగు : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓబులదేవరచెరువు (ఓడీసీ) మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ముందస్తు ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రిని సక్రమంగా వర్గీకరించి



సిద్ధంగా ఉంచాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు సీసీ కెమెరాల నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ నిర్దేశిత సమయంలో పూర్తి చేసి, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ రాజేంద్ర కుమార్ రెడ్డి, ఓడీసీ తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ రోజు కార్మికులకు... వేతనంతో కూడిన సెలవు

పుట్టపర్తి, నవంబరు4, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో నవంబరు 5న జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఎన్నికల్లో కార్మికులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల యాజమాన్యాలు తమ సంస్థల్లో పనిచేసే కార్మికులందరికీ నవంబరు 5న వేతనంతో కూడిన సెలవు తప్పనిసరిగా మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా యాజమాన్యాలు సహకరించాలని సూచించారు.



ఎన్నికల బందోబస్తుకు 1,383 మంది పోలీసులతో పాటు

11 ఏపీఎస్పీ ప్లటూన్లు

పుట్టపర్తి, నవంబరు 4, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో గురువారం జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల తరహాలోనే ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో మొత్తం 397 ఎంపీటీసీ స్థానాలకు గాను 20 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 377 ఎంపీటీసీ స్థానాలతో పాటు 32 జడ్పీటీసీ స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల బందోబస్తు కోసం ఇద్దరు అదనపు ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 35 మంది సీఐలు, 57 మంది ఎస్సైలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు కలిపి మొత్తం 1,383 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు 11 ఏపీఎస్పీ ప్లటూన్లను నియమించినట్లు ఎస్పీ తెలిపారు. గత ఎన్నికల అనుభవాలు, ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు బలగాలను మోహరించారు. రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ (క్యూఆర్‌టీ), రిజర్వ్ పార్టీలతో పాటు వజ్ర వాహనాన్ని అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాలపై డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్లరాదని, పోలీస్ యాక్ట్-30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్-163 అమల్లో ఉన్నందున ప్రజలు గుంపులుగా గుమిగూడరాదని ఎస్పీ సూచించారు. పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేయడం, గుమిగూడటం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, పోలింగ్‌కు ఆటంకం కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, వదంతులు, విద్వేషపూరిత పోస్టులు ప్రచారం చేసినా చర్యలు తప్పవని తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నియమావళిని పాటిస్తూ ప్రశాంతమైన పోలింగ్ నిర్వహణకు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా...

పూర్తి చేయాలి

అనంతపురం, నవంబరు 04, అమరావతి వెలుగు : జిల్లాలో గురువారం నిర్వహించనున్న రెండో సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం ఉరవకొండ, వజ్రకరూరు, కూడేరు మండలాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. పోలింగ్ సామగ్రిని జాగ్రత్తగా సంబంధిత కేంద్రాలకు తరలించాలని, పంపిణీ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు, నిర్దేశిత సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ నిర్దేశిత సమయంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి అలసత్వానికి తావివ్వకుండా పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. సమష్టి కృషితో ఎన్నికల పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సి. విష్ణు చరణ్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో సంబంధిత రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు అరుణ, జయశ్రీ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, కూడేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జుబేదాబేగం తదితరులు పాల్గొన్నారు.





ఎన్నికల సామగ్రి పంపిణీలో అప్రమత్తంగా ఉండాలి

: జేసీ మౌర్య భరద్వాజ్

నల్లమాడ, నవంబరు 04, అమరావతి వెలుగు : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి నల్లమాడ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ బుధవారం పరిశీలించారు. గురువారం జరగనున్న పోలింగ్‌కు సంబంధించి చేపట్టిన ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు. పోలింగ్ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులకు సూచించారు. పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పత్రాలు, ఇంకు, ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ వేగంగా, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. పోలింగ్ విధులకు వెళ్లే సిబ్బందికి అవసరమైన రవాణా సదుపాయాలు, భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జేసీ ఆదేశించారు.



రోడ్డు ప్రమాద బాధితుడికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

తక్షణ సాయం

అనంతపురం, నవంబరు 04, అమరావతి వెలుగు : నగరంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఫ్లైఓవర్ (రాంనగర్ ఫ్లైఓవర్)పై బైక్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తక్షణ సహాయం అందించారు. ఫ్లైఓవర్‌పై వెళ్తున్న సమయంలో ప్రమాదాన్ని గమనించిన ఆయన వెంటనే స్పందించి బాధితుడికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో పాటు ఫ్లైఓవర్‌పై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేయించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు. గాయపడిన వ్యక్తికి మంచినీరు అందించి మెరుగైన వైద్యం కోసం ఆటోలో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే బాధితుడు అందుకు అంగీకరించకపోవడంతో 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించి వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వాహనదారులు అతివేగానికి దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరిగి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు.



సేంద్రియ, చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యకర జీవనం

పుట్టపర్తి, నవంబరు 04, అమరావతి వెలుగు : సేంద్రియ ఆహార పదార్థాలు, చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యకరమైన జీవన విధానాలను అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పోషక విలువలున్న ఆహారాన్ని రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. పుట్టపర్తిలోని మామిళ్లకుంట వద్ద ఉన్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) హాల్, రెవెన్యూ భవన్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సుస్థిర ఆహార విధానాలపై అవగాహన, సేంద్రియ ఆహార ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖల మార్గదర్శకాల మేరకు నవంబరు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మిషన్ లైఫ్‌లోని ఏడు ప్రధాన అంశాల ఆధారంగా ప్రజలు, గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములను చేస్తూ సుస్థిర జీవన విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా













‘సుస్థిర ఆహార విధానాలను అవలంబిద్దాం’ అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా



సేంద్రియ ఆహార పదార్థాలు, చిరుధాన్యాలతో తయారు చేసిన పౌష్టికాహార ఉత్పత్తులు, చిరుధాన్యాల ప్రాసెసింగ్ ఉత్పత్తులు, సేంద్రియ గానుగ నూనెలు, ఫుడ్ బాస్కెట్లు తదితర 10 నుంచి 12 రకాల ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. వాటి తయారీ విధానం, పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణలో వాటి ప్రాధాన్యతను వివరించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తలు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాలు సైతం చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహారం, ఆరోగ్యం, పారిశుధ్యం, లింగ సమానత్వంపై అవగాహన పెంపొందించడంతో పాటు న్యూట్రి గార్డెన్స్, న్యూట్రి ఎంటర్‌ప్రైజెస్, గానుగ నూనెల తయారీ కేంద్రాలు, బయో రిసోర్స్ ఆధారిత యూనిట్ల ద్వారా పర్యావరణహిత జీవన విధానాలను ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) సహకారం అందించాయి. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ శశికళ, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాధిత బాలికకు అండగా ఉంటాం

అనంతపురం, నవంబరు 04, అమరావతి వెలుగు : రాప్తాడు ఘటనలో గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఏవీఎస్. సూర్యనారా యణరాజు బుధవారం పరామర్శించా రు. కమిషన్ సభ్యుడు చల్లా మధుసూదనరావుతో కలిసి బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను సమీక్షించి, బాలిక త్వరగా కోలుకునేందుకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ బాలిక కోలుకునే వరకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితురాలికి అవసరమైన అన్ని రకాల వైద్య, ఆర్థిక సహాయ సహకారాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాలిక సంరక్షణ, భద్రత, పునరావాసానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం బాలిక తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బాధిత కుటుంబానికి అండగా ఉంటాయని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ గంగాధర్‌రెడ్డి, డీసీపీఓ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576